గుంటూరు

ఆదివారం | 12 | జనవరి | 2025



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1818, హై లెవెల్ కాలువకు 80 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.



వైభవంగా కూడార్రై ఉత్సవం

ఫిరంగిపురం: స్థానిక గీతా మందిరంలో శనివారం కూడార్రై ఉత్సవం నిర్వహించారు. గోదారంగనాథ చిత్రం వద్ద దీపాలు వెలిగించి, 108 చిన్న కుండీల ప్రసాదాలు నివేదించారు.



ఘనంగా వేంకటేశ్వర కళ్యాణం

అచ్చంపేట: స్థానిక హరిహరక్షేత్రంలోని భూదేవి, శ్రీదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం రాత్రి ముక్కోటి ఏకాదశి సందర్భంగా కళ్యాణ వేడుక జరిగింది.

సంక్రాంతికి బిజీ లెస్

- ప్రజల దగ్గర డబ్బుల్లేవు
- మార్కెట్‌లో వ్యాపారాలు లేవు
- ఆర్థిక ఇబ్బందుల్లో పేద, మధ్యతరగతి వర్గాలు
- గిట్టుబాటు ధర లేక, కొనేవాళ్లు లేక నష్టాల్లో రైతులు
- గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలు రద్దు
- ఆర్థికంగా చేయూత ఇవ్వని కూటమి సర్కార్
- కొనుగోళ్లు పడిపోవడంతో చితికిపోతున్న వ్యాపారులు



వ్యాపారం లేక నగరంలో ఖాళీగా ఉన్న ఓ వస్త్ర దుకాణం

సాక్షి ప్రతినిధి, గుంటూరు : ఈ ఏడాది సంక్రాంతి పండుగకు వ్యాపారాలు వెలవెలబోతున్నాయి. పెళ్లిళ్ల సీజన్ మినహాయిస్తే క్రిస్మస్ నుంచి న్యూఇయర్ నుంచి సంక్రాంతి వరకూ నెలరోజులు వ్యాపారాలు పెద్దఎత్తున జరుగుతాయి. అయితే, ఈ ఏడాది పెద్దగా ఆదరణ లేదని వ్యాపారులు చెబుతున్నారు. ప్రజల వద్ద కొనుగోలు శక్తి తగ్గిపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కిరాణా వ్యాపారాలు డల్

సంక్రాంతికి పిండి వంటలు పెద్దఎత్తున చేస్తారు. దీంతో కిరాణా వ్యాపారాలు కూడా బాగా జరుగుతాయి. వస్త్ర వ్యాపారాలు, కిరాణ షాపులు, బంగారం షాపులతో పాటు ఫ్యాన్సీ, ఫుట్‌వేర్, పెయింట్స్, స్వీట్స్ షాపులన్నీ రద్దీగా ఉండేవి. అందుకు తగ్గట్లుగానే వ్యాపారులు క్రిస్మస్‌కు ముందే కావాల్సిన సరుకులు, మెటీరియల్స్ కొనుగోలు చేస్తుంటారు. అప్పులు చేసి అయినా పెద్దఎత్తున స్టాక్ తీసుకువస్తారు. ఒక్క గుంటూరు నగరంలోనే రూ. 150 కోట్ల రూపాయల వరకూ వ్యాపారం జరుగుతుంది. అయితే, ఈసారి వ్యాపారాలు రూ. 100 కోట్లు కూడా దాటేపరిస్థితి లేదని వ్యాపారస్తులు చెబుతున్నారు. పండుగ ముందు రోజుల్లో కూడా షాపులు ఖాళీగా ఉండటం గతంలో ఎప్పుడూ చూడలేదని వారు చెబుతున్నారు. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ మినహా చిన్న షాపులన్నీ వ్యాపారాలు లేక ఖాళీగా ఉన్నాయి. మార్కెట్‌లో డబ్బులు రొటేషన్ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఉందని వ్యాపారస్తులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల జేబుల్లో డబ్బులు ఉండకపోవడంతో కొత్తగా కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా పోతోంది. దీని ప్రభావం వ్యాపార రంగంపై తీవ్రంగా పడింది. ఒక రంగం అంటూ లేకుండా అన్ని రంగాలపై ఈ ప్రభావం పడింది. గత ఏడాది కంటే ఈ ఏడాది తమ వ్యాపారాలు భారీగా పడిపోయాయని వ్యాపారస్తులు చెబుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో జోరుగా వ్యాపారం

గత ప్రభుత్వ హయాంలో సంక్షేమంతో పాటు రైతులకు గిట్టుబాటు ధరలు ఉండటం వల్ల వ్యాపారాలు బాగా నడిచాయని వారు చెబుతున్నారు. ఈ ఏడాది రైతాంగం కూడా తీవ్రంగా నష్టపోయింది. ఒకవైపు వర్షాలు, తుఫాన్లు దెబ్బతీస్తే మరోవైపు గిట్టుబాటు ధరలు లేకపోవడం సమస్యగా మారింది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో కూడా ప్రభుత్వం విఫలం అయ్యింది. కేవలం 22 వేల టన్నులు మాత్రమే కొని మమ అనిపించింది. బయట మార్కెట్‌లో ధాన్యం బస్తాకు 13 వందల రూపాయలు కూడా రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మిర్చి, ఇతర పంటలు వేసిన రైతుల పరిస్థితి కూడా దయనీయంగానే ఉంది. దీంతో రైతుల వద్ద డబ్బులు లేకపోవడం కూడా మార్కెట్‌పై ప్రభావం చూపింది.



నగరంలో ఖాళీగా ఉన్న కిరాణా షాపు

పథకాలతో చేతిలో డబ్బుల గలగలలు

గత ప్రభుత్వంలో ప్రతి నెలా సంక్షేమ క్యాలెండర్ ప్రకారం సంక్షేమ పథకాల డబ్బులు ప్రజల ఖాతాలలో ఠంచన్‌గా పడేవి. రైతాంగంలో పాటు పేద మధ్యతరగతి ప్రజల వద్ద డబ్బులు ఉండటంతో వ్యాపారాలు బాగా సాగేవి. మార్కెట్లు కళకళలాడేవి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసింది. ఈ పథకాలతో ప్రజలకు నేరుగా వారి ఖాతాలోనే నగదు చేరేది. వాటిని ఆయా లక్ష్యం మేరకు వినియోగించుకుంటూ ఆర్థికంగా ఎదిగేవారు. సొమ్మును పొదుపు చేసుకొని, పండగ వేళ కావాల్సినవి కొనుగోలు చేసుకునేవారు. అమ్మఒడి, ఆసరా, చేయూత, చేదోడు, విద్యా దీవెన, వసతి దీవెన, ఇన్‌పుట్స్ సబ్సిడీ, రైతు భరోసా, వడ్డీ మాఫీ, ఆసరా, వాహనమిత్ర పథకాలతో పాటు వివిధ రంగాలు అభివృద్ధి పథంలోకి వచ్చేందుకు దోహదం జరిగింది. అయితే, కొత్తగా ఏడు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పింఛన్లు ఇవ్వడం తప్పా మరే సంక్షేమ పథకం అమలు చేయడం లేదు. పింఛన్ల డబ్బులు మందులకే సరిపోతుంటాయి. దీంతో వారు ఆ డబ్బులతో ఇతరత్రా కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసు ఎత్తడం లేదు. దీంతో వ్యాపారాలు సగానికి పడిపోయాయి.

వ్యాపారం ఆశాజనకంగా లేదు

ఈ ఏడాది సంక్రాంతి పండుగ హడావుడి పెద్దగా కనిపించడంలేదు. ప్రధానంగా దుస్తులు, బెల్లం, ఆయిల్, సుగంధ ద్రవ్యాలు విక్రయాలు ఎక్కువగా జరుగుతాయి. ఈసారి సుమారు రూ.150 కోట్ల వ్యాపారం జరుగుతుందనేది ఒక అంచనా. అయితే, ధరలు ఎక్కువగా ఉండటంతో ఈదఫా ఆశాజనకంగా లేదని చెప్పవచ్చు. గతంలో రూ.100 కోట్ల వ్యాపారం ఉన్నప్పటికీ దుకాణాలు కళకళలాడేవి.

– అతుకూరి ఆంజనేయులు, గౌరవాధ్యక్షుడు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

అత్తోట గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

మంత్రి మనోహర్



అత్తోట(కొల్లిపర): రానున్న రోజుల్లో అత్తోటను ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఆహార పౌరసరఫరాలశాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని అత్తోట గ్రామంలో శనివారం ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన మినీ గోకులం షెడ్డును జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో అర్హత ఉన్న ప్రతి రైతూ భాగస్వామ్యం కావాలని తెలిపారు. మినీ గోకులం షెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.85 లక్షలు అందిస్తుందని చెప్పారు. దీనిలో లబ్ధిదారులు కేవలం రూ.18వేలు పెట్టాలని, మిగిలిన రూ.1.67లక్షలను ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న దానికింటే అదనంగా ఇంకా రూ.50వేలు చేతికి పడుతున్నాయని నిర్మాణదారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.వెంటనే స్పందించిన మంత్రి ఈ విషయాన్ని త్వరలోనే ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు పెంచేలా కృషి చేస్తానని తెలిపారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో మినీ గోకులం షెడ్ల నిర్మాణం పథకం ద్వారా 386 మందికి అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో ఇప్పటికి 170 మంది నిర్మాణాలు పూర్తి చేశారని, మిగిలిన వారు కూడా నిర్మించుకోవడానికి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు, అడపా నారాయణరెడ్డి , డ్వామా పీడీ శంకర్, డీపీవో సాయికుమార్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి నరసింహరావు, తెనాలి పశుసంవర్ధక శాఖ డీడీ వై.పద్మావతి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పొన్నూరు విచ్చేసిన ఒడిశా గవర్నర్ హరిబాబు



పొన్నూరు: ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు శనివారం పొన్నూరు వచ్చారు. నిడుబ్రోలుకు చెందిన కేంద్ర మాజీ మంత్రి పాములపాటి అంకినీడు ప్రసాదరావు సతీమణి శివప్రదాదేవి సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు నన్నపనేని రాజకుమారి, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు దర్గా టు దుర్గ కాలి నడక

పెదకాకాని: జాతి సమైక్యత కోరుతూ వీవీఐటీ ఆధ్వర్యంలో దర్గా టు దుర్గ కాలి నడక నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఉదయం 5.30 గంటలకు గుంటూరు మస్తాన్ దర్గా నుంచి విజయవాడలోని దుర్గగుడికి నడక ప్రారంభమవుతుందని చెప్పారు. 1500 మంది విద్యార్థులతో 33 కిలోమీటర్లు మేర ఈ కాలినడక కొనసాగుతుందని చైర్మన్ పేర్కొన్నారు.

వైభవంగా గోదాదేవికి పూజలు



తాడేపల్లి రూరల్: మంగళగిరి బాపూజీ విద్యాలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస కార్యక్రమాలలో శనివారం 27వ రోజు 27వ పాశురాన్ని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా జీయర్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థ ప్రసాద గోష్ఠి, మంగళ శాసనాలతో కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 250 మంది భక్తులు గోదా అమ్మవారికి సారెను సమర్పించి స్వామి వారి మంగళాశాసనాలు అందుకున్నారని పేర్కొన్నారు. కూడార్రై (పాయసం) మహోత్సవం అత్యంత వైభవంగా జరిగిందని చెప్పారు.

నేడు సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహావిష్కరణ

తెనాలి: ప్రఖ్యాత సినీ హీరో, నిర్మాత, దర్శకుడు సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఆదివారం తెనాలిలో ప్రతిష్ఠించనున్నారు. ఆలిండియా సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్, తెనాలి ఆధ్వర్యంలో తెనాలి-విజయవాడ రోడ్డులోని తెనాలి బండ్‌పై సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ప్రముఖ సినీనిర్మాత, పద్మాలయ స్టూడియోస్ అధినేత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పాల్గొంటారు.


కోడి పందేలు వేస్తే కఠిన చర్యలు



గుంటూరు వెస్ట్: పవిత్ర పండుగలను సంతోషాలతో జరుపుకోవాలని, జీవ హింసకు పాల్పడవద్దని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం కోడి పందేల నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కోడి పందాలను ఆడినా నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని, దీనికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ బృందాలు ఈ నెల 17 వరకు గ్రామాల్లో సచరిస్తాయని తెలిపారు. నిత్యం వారు పహారా కాస్తారని తెలిపారు. ప్రజలు సమాచారం అందితే స్థానిక పోలీసులకు గానీ, రెవెన్యూ అధికారులకు గానీ తెలపాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్, డీఆర్వో ఖాజావలి, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగం, స్థలం ఇప్పిస్తానని టోకరా

రూ .59 లక్షలు తీసుకుని మోసం చేసిన కేసులో వ్యక్తి అరెస్టు



వివరాలు తెలుపుతున్న మంగళగిరి పట్టణ సీఐ వినోద్ కుమార్, సిబ్బంది

మంగళగిరి (తాడేపల్లి రూరల్): ఉద్యోగాలు ఇప్పిస్తానని పెద్ద మొత్తంలో నగదు తీసుకుని మోసం చేసిన వ్యక్తిని మంగళగిరి పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పట్టణ సీఐ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు శ్రీనివాసాపురానికి చెందిన చుక్కా బాబు అలియాస్ లవ్ బాబు కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళగిరి మండలం ఆత్మకూరులో నివాసముంటున్నాడు. జల్సాలకు అలవాటుపడి స్నేహితులతో కలసి మోసం చేయడమే పనిగా పెట్టుకున్నాడు. స్నేహితుల ద్వారా ఖరీదైన కార్లను అద్దెకు తీసుకుని వాటిల్లో తిరుగుతూ కోర్టులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఫొటోలు దిగేవాడు. ఈ క్రమంలో మంగళగిరి బస్టాండ్ వద్ద ఇల్లు అద్దెకు ఇవ్వబడును అనే బోర్డు చూసి, అందులో ఉన్న ఫోన్ నంబర్‌కు కాల్ చేశాడు. ఇల్లు అద్దెకు కావాలంటూ యజమాని దాసరి రామమోహనరావును పరిచయం చేసుకున్నాడు. ఆయన తమ్ముడికి ఉద్యోగ అవసరం ఉందని తెలుసుకుని హైకోర్టులో ఇప్పిస్తానని నమ్మబలికాడు. అప్పటికే అతని ఫోన్‌లో దిగిన ఫొటోలు చూపించాడు. ప్రభుత్వంలో మంచి పలుకుబడి ఉందని, కచ్చితంగా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. ఆ మాటలు నమ్మి రామమోహనరావు రూ. 10 లక్షలు ఇచ్చాడు. అనంతరం హైకోర్టులో స్టెనోగా పని చేసే అరుణ్ అనే వ్యక్తి చనిపోయాడని, అతని పేరున ఉన్న రెండు ఎకరాలు హైకోర్టు న్యాయమూర్తుల కస్టడీలో ఉందని తెలిపాడు. రూ. 49 లక్షలు ఇస్తే ఆ భూమిని నలుగురు జడ్జిలతో రామమోహనరావు పేరున రిజిస్టర్ చేస్తానని నమ్మబలికాడు.అతడి దగ్గర నుంచి ఉద్యోగం, భూమి నిమిత్తం మొత్తం రూ. 59 లక్షలు వసూలు చేశాడు. ఆ తర్వాత వాటి గురించి రామమోహనరావు అడగ్గా అదిగో ఇదిగో అంటున్నాడు. దీంతో 2024 నవంబర్‌లో చుక్కా బాబు అతని స్నేహితులు వంశీకృష్ణ, తరుణ్, అతని కుటుంబ సభ్యులపై మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రామమోహనరావు ఫిర్యాదు చేశాడు. శనివారం చుక్కా బాబు విజయవాడలో ఉన్నాడని సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ వినోద్‌కుమార్ సిబ్బందితో వెళ్లి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. గతంలో చుక్కా బాబుపై పోక్సో యాక్ట్, 498ఎ, చీటింగ్ కేసులతో పాటు పలు కేసులు వివిధ ప్రాంతాల్లో నమోదైనట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ సోషల్ మీడియాలో వచ్చే మెసేజ్‌లు గానీ, ఇలాంటి వ్యక్తులను గానీ ఎవరూ నమ్మవద్దని సీఐ సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ల ద్వారా మాత్రమే జరుగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ వినోద్‌కుమార్ కోరారు.



లవ్‌బాబు (ఫైల్)

అమ్మా.. క్షమించు!

- పేదల పొట్ట కొడుతున్న టీడీపీ నేతలు
- వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిత్యాన్నదానం నిలిపివేత

పట్నంబజారు: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద జరిగే అన్నదానాన్ని అధికార పార్టీ నేతలు ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2018 నుంచి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఇక్కడ అన్నదానాన్ని నిర్వహిస్తున్నారు. కార్మికులు, కూలీలు, అనాథలు, పేదలు నిత్యం వస్తుంటారు. ప్రతిరోజూ 300 నుంచి 400 మంది వరకు ఆలయం ముందు పేదల ఆకలి వాసవీ క్లబ్ సభ్యులు తీరుస్తున్నారు. అయితే, నిత్యాన్నదానాన్ని ఇటీవల నిలిపివేశారు. అధికార పార్టీ నేతల హుకుం జారీతో అధికారులు సైతం డూడూ బసవన్నల్లా మారిపోయారు. కనీసం పేదల ఆకలి తీరుస్తున్నారన్న జాలి కూడా లేకుండా నిత్యన్నదాన పథకాన్ని అర్ధంతరంగా నిలిపివేశారు.

వై.ఎస్.జగన్ పుట్టినరోజే కారణమా?

ఆలయం ఎదుట వాసవీ క్లబ్ నిర్వహించే అన్నదానానికి ఎంతో మంది దాతలు వితరణ చేస్తుంటారు. అయితే, గత ఏడాది డిసెంబరు 21న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు, పార్టీ కార్యకర్తలు వాసవీ క్లబ్‌లో అన్నదానానికి డొనేషన్లు అందజేశారు. ఈవిషయం తెలుసుకున్న ప్రస్తుతం ఆలయంలో హడావుడి చేస్తున్న అధికారికి పార్టీకి చెందిన కొంత మంది నేతలు, ఆలయ అధికారుల ద్వారా నిత్యన్నదానాన్ని నిలువరించారు. ఎటువంటి అన్నదానం చేయరాదంటూ అధికారులకు బెదిరింపులకు గురిచేసి హుకుం జారీ చేయించారు. అధికార పార్టీ నేతల వేధింపులు తట్టుకోలేక అన్నదానాన్ని నిలిపివేయాలంటూ అధికారులు సైతం తలొగ్గారు. అయితే, గతంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తోపాటు అనేక సినిమా స్టార్‌ల పుట్టినరోజులు, వర్ధంతి కార్యక్రమాల్లో అన్నదానాలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ప్రత్యేకంగా వై.ఎస్.జగన్ జన్మదినం నుంచి అన్నదానాన్ని నిలిపివేయడంతో కూలీలు, పేదలు, అనాథలు ఆకలితో అలమటిస్తున్నారు.

అధికార పార్టీ నేతల అడ్డా

ఆర్యవైశ్య సామాజిక వర్గానికి సంబంధించి శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ఇప్పటికే స్పష్టంగా ఒక కమిటీ ఉంది. అయినా అధికార పార్టీకి చెందిన అదే సామాజిక వర్గానికి చెందిన ఒక కార్పొరేటర్, నియోజకవర్గ ఎమ్మెల్యే వెంట తిరుగుతూ తానే అంతా అంటూ చెప్పుకుంటున్న మరో దుకాణ యజమాని ఆలయంలో పెత్తనం చెలాయిస్తున్నారు.



వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం

వారం రోజులుగా భోజనం లేదు



శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద నిత్యం అన్నదానం ఉండేది. ఇక్కడే దుకాణం పనులు చేసుకుంటూ మధ్యాహ్నం దేవాలయానికి వచ్చి భోజనం చేసేవాడిని. గత వారం రోజులుగా నిత్యం వస్తున్నప్పటికీ భోజనం లేదని చెబుతున్నారు. ఎందుకు ఆపారనేది ? తెలియదు. నిత్యం మాలాంటి పేదలకు కడుపు నింపే భోజన కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని కోరుతున్నా.

– నాగసాయి, కార్మికుడు

ఆర్జేసీ అనుమతి కావాలి

ఆలయం ఎదురుగా నిర్వహిస్తున్న అన్నదానానికి సంబంధించి ఆర్జేసీ అనుమతులు కావాలి. ఆలయం ఎదుట వాసవీ క్లబ్ వారు నిర్వహించడం వారే ఆపేశారు. ఆలయం ద్వారాల వద్ద పేదలకు అన్నదానం చేయాలంటే అధికారుల అనుమతి తప్పనిసరి.

– జి.మాధవి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్



గుంటూరు బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



సొంతూరుకు చలో..చలో !

ఏపీఎస్ ఆర్టీసీ సంక్రాంతి శోభ సంతరించుకుంది. ఈనెల 9 నుంచి పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇవ్వడం, రెండో శనివారం నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు సైతం సెలవులు కావడంతో భారీగా పట్టణాల నుంచి పల్లెలకు బస్సులు తరలి వెళుతున్నాయి. ప్రయాణికుల రాకపోకలతో బస్టాండ్ ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. ఈనెల 9, 10, 11, 12 తేదీల్లో భారీగా ఆర్టీసీకి ఆదాయం చేకూరనుంది. నిత్యం 40 నుండి 50వేల మంది ఆర్టీసీ ద్వారా వారి ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. పండుగ నేపథ్యంలో సుమారు లక్ష మంది గుంటూరు రీజియన్ పరిధిలోని గుంటూరు-1,2, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోల ద్వారా ఆయా ప్రాంతాలకు చేరుకుంటున్నారు. మామూలు రోజుల్లో ఆర్టీసీ ఆదాయం రూ. 50 లక్షలు వస్తోంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రద్దీ భారీగా ఉండటంతో రూ. 70 లక్షల మేరకు నిత్యం ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. దీనిలో భాగంగా గుంటూరు రీజియన్‌లోని ఆయా డిపోలకు చేరుకునేందుకు హైదరాబాద్, బెంగుళూరు, వైజాగ్, చెన్నై, ఇతర ప్రాంతాల నుంచి 150 బస్సులను ఇప్పటికే ఏర్పాటు చేశారు. పండుగ అనంతరం తిరుగు ప్రయాణానికి తగ్గట్లు బస్సులను ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు.

– పట్నంబజారు





గుంటూరు రైల్వే స్టేషన్‌లో..

కనకదుర్గ వారధిపై ట్రాఫిక్ జామ్

- గంటసేపు నిలిచిన ట్రాఫిక్
- అప్రమత్తమైన పోలీసులు
- మరమ్మతులకు గురైన వాహనం తొలగింపు
- ఐదు నిమిషాల్లో మరో రోడ్డు ప్రమాదం
- మళ్లీ నిలిచిపోయిన ట్రాఫిక్


వారధిపై మరమ్మతులకు గురైన లారీని తీసుకు వెళుతున్న క్రేన్

తాడేపల్లి రూరల్: విజయవాడ నుంచి గుంటూరు వెళ్తున్న ఓ లారీ మరమ్మతులకు గురై శనివారం కనకదుర్గ వారధిపై నిలిచిపోయింది. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. అప్రమత్తమైన తాడేపల్లి ట్రాఫిక్ పోలీసులు ఆ వాహనాన్ని క్రేన్ సహాయంతో తొలగించారు. అప్పటికే కనకదుర్గ వారధి 16 నంబర్ పిల్లర్ నుంచి కుంచనపల్లి వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. తాడేపల్లి ట్రాఫిక్ ఎస్.ఐ నారాయణ క్రేన్ సహాయంతో లారీని వారధి అవతలి వరకు తీసుకు వెళ్లారు. ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న సమయంలో గుంటూరు నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో ఒక వాహనాన్ని మరో వాహనం ఢీకొంది. దీంతో ట్రాఫిక్ మరోసారి నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పది మంది పోలీసులు కష్టపడి క్లియర్ చేశారు.

అదృశ్యమైన వ్యాపారి మృతి

రెంటచింతల: మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన వ్యాపారి పేరం బ్రహ్మారెడ్డి (41) ఇంటి నుంచి వెళ్లి అదృశ్యం అయినట్లు ఈ నెల 6 వ తేదీన ఆయన భార్య సుజాత పోలీసులను ఆశ్రయించారు. తన భర్త 1వ తేదీ సాయంత్రం వ్యాపారం నిమిత్తం వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మిస్సింగ్ కేసు నమోదైంది. మరోవైపు శుక్రవారం ఒంగోలు జిల్లా కురిచేడు మేజర్ కాల్వలో ఓ మృతదేహం కొట్టుకొచ్చినట్లు, ఒంగోలు జనరల్ ఆస్పత్రికి తరలించి భద్రపరిచినట్లు అక్కడి పోలీసులు స్థానిక ఎస్ఐ సీహెచ్ నాగార్జునకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సూచన మేరకు బ్రహ్మారెడ్డి కుటుంబ సభ్యులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఒంగోలు జనరల్ ఆస్పత్రిలో చూపించిన మృతదేహం బ్రహ్మారెడ్డిది కాదని తెలిసింది. మార్చురీ వాచ్‌మెన్‌కు తాము బ్రహ్మారెడ్డి అనే వ్యక్తి కోసం వచ్చామని కుటుంబసభ్యులు తెలిపారు. దీంతో ఈ నెల 7వ తేదీన ఒంగోలు సమీపంలోని నంద్యాల గ్రామంలో తీవ్ర జ్వరంతో కిందపడిన ఓ వ్యక్తి కనిపించడంతో కొందరు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారని వాచ్‌మెన్ తెలిపాడు. వారు ఒంగోలు జనరల్ ఆస్పత్రిలో ఆయన్ను చేర్పించారని, చికిత్స పొందుతూ అదే రోజు గుండెపోటుతో మృతి చెందినట్లు పేర్కొన్నాడు. మృతదేహం చూపించడంతో అది బ్రహ్మారెడ్డిదేనని కుటుంబ సభ్యులు, బంధువులు గుర్తించారు. రెంటాలలో ధాన్యం, మిర్చి వ్యాపారం చేసే బ్రహ్మారెడ్డికి భార్య సుజాత, కుమారులు శ్రీధర్ రెడ్డి, తేజారెడ్డి ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మేడికొండూరులో ప్రొటోకాల్ ఉల్లంఘన

- దళిత ఎంపీపీ మన్నవ స్వప్నకు అవమానం
- సీసీ రోడ్ల శంకుస్థాపనకు పిలిచి వచ్చేలోగా ప్రారంభించి అవమానించారని ఆవేదన


మేడికొండూరులో శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

తాడికొండ: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న మేడికొండూరు మండలంలో దళిత ఎంపీపీ మన్నవ స్వప్నకు అవమానం జరిగింది. ఎస్సీ నియోజకవర్గం అయినప్పటికీ ఓ ఎస్సీ మహిళకు శంకుస్థాపన ప్రారంభోత్సవాల్లో ప్రాధాన్యత ఇవ్వలేదు. కార్యక్రమానికి ఆహ్వానించి ఆమె వచ్చేలోగా టీడీపీ నాయకులు ఒత్తిడి చేసి మరీ శంకుస్థాపన చేసి అవమాన పరిచారు. మేడికొండూరులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.15 లక్షలతో నిర్మించబోయే సీసీ రోడ్ల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన ఉందంటూ ఎంపీడీవో చందన ఆహ్వానించారు. ఆమె ఆహ్వానం మేరకు కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన ఎంపీపీ మన్నవ స్వప్నకు చేదు అనుభవం ఎదురైంది. అప్పటికే స్థానిక సర్పంచ్ నాగమణితో శిలాఫలకాన్ని ఆవిష్కరింపజేసి కూర్చున్నారు. దీనిపై స్వప్న ఎంపీడీవోను ప్రశ్నించగా తనకు టీడీపీ నాయకుల నుంచి వచ్చిన ఒత్తిడి మేరకే అలా చేశానని తెలిపింది. ఎస్సీ నియోజకవర్గంలో దళిత ఎంపీపీ అయిన తనను అవమానించేలా వ్యవహరించడం, అవమానించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీపీ మన్నవ స్వప్న తెలిపారు.

దళిత మహిళననే చిన్నచూపు



దళిత మహిళననే తనపై చిన్నచూపు చూస్తూ టీడీపీ నాయకులు అడుగడుగునా అవమానిస్తున్నారు. ప్రోటోకాల్ ప్రకారం తనకు ఇవ్వాల్సిన స్థానం ఇవ్వకుండా అడ్డుకోవడం దుర్మార్గం. ప్రజా ప్రతినిధులను గౌరవించాల్సిన బాధ్యత విస్మరించి అవమానించడంపై కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తా

– మన్నవ స్వప్న, ఎంపీపీ, మేడికొండూరు.

గణపవరంలో భారీ చోరీ

నాదెండ్ల: గణపవరం గ్రామంలో భారీ చోరీ జరిగింది. తాళాలు వేసి ఉన్న ఇంటిలో సుమారు 30 సవర్ల బంగారం, రూ.లక్షకు పైగా నగదు చోరీకి గురైంది. గ్రామానికి చెందిన తూబాటి శేషగిరిరావు దంపతులు ఈ నెల 10న ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం వెళ్లారు. తిరిగి రాత్రి 9 గంటలకు ఇంటికి చేరుకున్నారు. ఇంటి వెనుక వైపు ఉన్న తలుపులు పగలగొట్టి ఉండటం గమనించారు. బీరువా పగలగొట్టి బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు నాదెండ్ల పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు, ఎస్సై జి.పుల్లారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. గుంటూరు క్లూస్‌టీం సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని సాక్ష్యాధారాలు సేకరించారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

దళితులపై దమనకాండ

- దౌర్జన్యంగా చర్చి స్థలంలో రోడ్డు నిర్మాణం
- 180 మంది పోలీసుల మోహరింపు
- ఎస్సీలను స్టేషన్‌లో నిర్బంధించి గోడకూల్చి రహదారి నిర్మాణం


పొక్లెయిన్‌తో గోడను కూల్చుతున్న అధికారులు

తాడికొండ: ఎస్సీ నియోజకవర్గమైన ఫిరంగిపురం మండలం పొనుగుపాడులో శనివారం దళితులపై దమనకాండ జరిగింది. తెలుగుదేశం పార్టీ నాయకుల కనుసన్నల్లో జరిగిన ఈ వ్యవహారంలో ఎస్సీలకు చెందిన చర్చి స్థలంలోకి ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారు నడక దారి వేసేందుకు అడ్డదారిలో పావులు కదిపారు. గతంలో దీనిపై పలుమార్లు వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో దళితులు తమకు ఉన్న భూమి హక్కులను అధికారులకు చూపించడంతో, చర్చి స్థలం కాపాడుకునేందుకు గోడ నిర్మాణానికి గతంలో ఆదేశాలు జారీ చేశారు. దీంతో గత ప్రభుత్వ హయాంలో గోడ నిర్మాణం జరిగింది. అయితే, అప్పుడు కోర్టుకు వెళ్లిన ఓసీ సామాజిక వర్గం వ్యక్తులు టీడీపీ అధికారంలోకి రాగానే పావులు కదిపారు. కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు రాదని గ్రహించి కేసును వాపసు తీసుకున్నారు. అంతే, అనుకున్నదే తడవుగా అడ్డగోలుగా రాత్రికి రాత్రి 180 మంది పోలీసులను రంగంలోకి దించి శనివారం గోడను కూల్చి రోడ్డు నిర్మాణం చేయించారు. ఇందుకు సంబంధించి ఇరు వర్గాలను ఓ దగ్గర కూర్చోబెట్టి రాజీ చేసే యత్నం చేయలేదు. నోటీసులు కూడా ఇవ్వకుండా అడ్డదారిలో కూల్చివేయడం వెనుక రాజకీయ ప్రమేయం ఉందని దళితులు వాపోతున్నారు.

బ్రిటిషర్ల హయాంలోనే అన్ని కులాలకు స్థలం కేటాయింపు

గ్రామ సెంటర్లో 1903లో ఓసీలు, ఎస్సీలు, ముస్లిం సామాజిక వర్గానికి బ్రిటిష్ హయాంలో భూములు కేటాయించారు. ఓసీ సామాజిక వర్గం రామాలయం నిర్మాణం చేసుకోగా, దాని పక్కనే ముస్లింలు బరియల్ గ్రౌండు నిర్మాణం చేసుకున్నారు. ఎస్సీలు చర్చి నిర్మాణం చేసుకోగా ప్రహరీ నిర్మించుకునేందుకు తగిన ఆర్థిక స్తోమత లేక ఖాళీగా వదిలేశారు. చర్చి వెనక భాగంలో 20 అడుగుల వెడల్పు ఉన్న స్థలం తేరు ప్రదక్షిణ కోసం వినియోగిస్తున్నారు. కాగా 2017లో రోడ్డు వేసేందుకు టీడీపీకి చెందిన ఓసీ నాయకులు ప్రయత్నించారు. దీనిని కాలనీ వాసులు వ్యతిరేకించారు. తమ వద్ద ఉన్న ఆధారాలతో ఆర్డీవో కలెక్టర్ల వద్ద చూపించి 2019లో చర్చి తూర్పు వైపున గోడను నిర్మించారు. దీనిపై అక్రమంగా గోడ కట్టారంటూ కోర్టులో కేసు వేసిన ఓసీ సామాజిక వర్గం, టీడీపీ అధికారంలోకి రాగానే గతేడాది డిసెంబర్‌లో కేసును విరమించుకుంది.

పోలీసుల హడావుడి

శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ , ఫిరంగిపురం సీఐ రవీంద్ర, మరో నలుగురు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు 180 మంది పోలీసులు భారీగా మోహరించి పొనుగుపాడు సెంటర్లో హడావుడి చేశారు. మండల తహసీల్దార్ జె.ప్రసాదరావు, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లుల సమక్షంలో పొక్లెయిన్‌తో గోడను కూల్చేడయంతో మహిళలు భోరున విలపించారు. కాలువపై సిమెంటు తూములు వేసి మట్టితోలించి పూర్తిగా చదునుచేసి రోడ్డు వేశారు.

చర్చికి సంబంధించిన స్థలం



మా చిన్న తనం నుంచి అది చర్చి స్థలంగా ఉండేది. అన్యాయంగా గోడను కూలిచ్చేశారు. అధికారం చేతిలో ఉందకదా అంటూ ఇటువంటి పనులు చేస్తున్నారు. దుర్మార్గమైన రీతిలో ప్రవర్తించారు.

–ఎం. జయపాల్, గ్రామస్తుడు

న్యాయం కావాలి



మాకు న్యాయం కావాలి. దౌర్జన్యంగా గోడను కూలిచ్చేశారు. దేముడు చూస్తు ఊరుకోడు. చర్చివెనక స్థలంలో ఇలా చేయడం అన్యాయం, అక్రమంగా గోడ కూల్చివేయడం దారుణం. మాకు న్యాయం కావాలి.

చావా శ్రీలక్ష్మి , కాలనీ మహిళ

వడ్డే ఓబన్నకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి ప్రాంత యుద్ధ వీరుడు వడ్డే ఓబన్న అని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ కొనియాడారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో శనివారం వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవం కోసం ఓబన్న వీరోచితంగా పోరాడారని తెలిపారు. రేనాటి వీరుడు వడ్డే ఓబన్న చరిత్రను నేటి తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని పేర్కొన్నారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, డీఎస్పీలు జయరాంప్రసాద్ (పశ్చిమ), శివాజీరాజు (సీసీఎస్), ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు తగలబెట్టండి!

సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ

లక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో పదేపదే విద్యుత్ భారాలు మోపడానికి నిరసనగా ఈ నెల 13న భోగి మంటల్లో బిల్లులు దగ్ధం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నేతాజీ పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాయలంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెలలో వచ్చిన బిల్లులో 2022 ఏప్రిల్, 2023 ఏప్రిల్‌లో వినియోగించుకున్న కరెంట్‌కు, ఇటీవలే 2024లో నవంబర్‌లో చెల్లించిన కరెంటు బిల్లులకు కూడా సర్దుబాటు చార్జీలపేరుతో ప్రజలపై భారాలు మోపుతున్నారని ఆరోపించారు.ఈ నెలలో కట్టిన విద్యుత్ బిల్లులకు కూడా వచ్చే నెలలో సర్దుబాటు చార్జీలపేరుతో ప్రజలపై భారాలు వేసేదానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దొడ్డిదారిన ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం మానుకుని, గతంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చేనేతలు రాజకీయంగా బలపడాలి

ఏఐడబ్ల్యూఎఫ్ జాతీయ అధ్యక్షులు బండారు


మాట్లాడుతున్న బండారు ఆనంద ప్రసాద్

మంగళగిరి (తాడేపల్లి రూరల్): రాజకీయంగా బలపడడానికి చేనేత వర్గాలవారందరూ కలసికట్టుగా ముందుకు రావాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ (ఏఐడబ్ల్యూఎఫ్) జాతీయ అధ్యక్షులు బండారు ఆనంద ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని ఆర్ఆర్ కన్వెన్షన్‌లో శనివారం ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రథమ నూతన సంవత్సర క్యాలెండర్‌ను చేనేత నేతల సమక్షంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ చేనేత నాయకులందరితో కలసి ఫిబ్రవరి 2న గన్నవరంలో చేనేత ప్రముఖులతో సభ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు మాట్లాడుతూ 18 ఉప కులాలుగా విభజించడం సరికాదని, చిన్న కులాలన్నింటిని కలుపుకుని చేనేత కులం ఒక్కటిగా ఏర్పడాలని కోరారు. ఏపీ మెడికల్ సర్వీస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వావిరాల సరళాదేవి, మంగళగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ గంజి చిరంజీవి పాల్గొన్నారు.

ఐసీసీని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తాం

- అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు
- జెడ్ఆర్‌యూసీసీ సభ్యునిగా ఆతుకూరి ఆంజనేయులు నియామకం


ఆతుకూరి ఆంజనేయులును సత్కరిస్తున్న అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు

నగరంపాలెం: రానున్న రోజుల్లో చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ)ను మరింత అభివృద్ధిలోకి తీసుకెళ్తామని అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు అన్నారు. జిన్నా టవర్ కూడలిలోని కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐసీసీ పరిధిలోని వ్యాపారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, వారి సమస్యలకు పరిష్కార మార్గం చూపుతామని చెప్పారు. పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండు రోజుల క్రితం జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. ఐసీసీ శాశ్వత గౌరవాధ్యక్షునిగా, ఎస్‌సీఆర్ జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్‌టేటివ్ కమిటీ (జెడ్‌ఆర్‌యూసీసీ) సభ్యునిగా నియమితులైన ఆతుకూరి ఆంజనేయులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆతుకూరి ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు రైల్వేకు సంబంధించి సమస్యల్ని తన దృష్టికి తేవాలని కోరారు. బోగీల పెంపు, రైళ్ల నిలుపుదల చేయాల్సిన స్టేషన్లు, కొత్త మార్గాలకు ఏర్పాటు వంటి విషయాలపై జోనల్ సమావేశంలో ప్రస్తావించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షులు టి.ఎల్.వి.వీరాంజనేయులు, తూనుగుంట్ల నాగేశ్వరరావు, ఆతుకూరి నగేష్‌కుమార్, మాజీ కార్యదర్శి అన్నా పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.